సామాన్యుడి గొంతుగా.. సామాజిక సమర వేదికగా..
epaper.manachourasta.com
# మన చౌరాస్తా
The Complete News way
సంపుటి : 02 | సంచిక : 134 | మంగళవారం, 23 సెప్టెంబర్ 2025

## మేడారంపై సీఎం రేవంత్‌రెడ్డి
# ప్రత్యేక దృష్టి

- జాతర పనుల పరిశీలనకు నేడు మేడారం రాక
- అధికారులతో ప్రత్యేక సమీక్ష సమావేశం

**ములుగు, మన చౌరాస్తా :**

ఆసియా ఖండంలోనే అతి పెద్దదైన మేడారం జాతరను మరింత ఘనంగా నిర్వహించేందుకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం నడుంబిగించింది. అందులో భాగంగా మంగళవారం ముఖ్యమంత్రి మేడారం పనులను పరిశీలించనున్నారు. ముఖ్యమంత్రి జాతర ఏర్పాట్లపై ప్రత్యేకంగా శ్రద్ధ వహిస్తున్నారు. అందులో భాగంగానే మంగళవారం మేడారం క్షేత్ర స్థాయి సందర్శనకు సీఎం వస్తున్నారు. స్వయంగా ముఖ్యమంత్రి క్షేత్ర స్థాయికి వెళ్లి జాతరకు ముందే ఏర్పాట్ల ప్రణాళిక, ప్రతిపాదనలను పరిశీలించటం ఇదే తొలిసారి. మేడారం పూజరులు, ఆదివాసీ పెద్దలు, మంత్రులు, గిరిజన ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రముఖులతో జాతర నిర్వహణ, కొత్త నిర్మాణాలపై ముఖ్యమంత్రి మేడారంలో సమీక్ష నిర్వహించనున్నారు. ఆదివాసీ సంప్రదాయాలకు పెద్ద పీట వేస్తూ ఇలవేల్పులు సమ్మక్క, సారలమ్మ, పగిడిద్ద రాజు, గోవిందరాజుల గద్దెలున్న ప్రాంగణాన్ని లక్షలాది భక్తులు దర్శించుకునేందుకు వీలుగా మేడారంలో భారీ ఎత్తున అభివృద్ధి పనులకు ప్రభుత్వం శ్రీకారం చుడుతోంది. కోట్లాది భక్తులు వచ్చే జాతర ప్రాశస్త్యానికి తగ్గట్లు భారీ ఎత్తున స్వాగత తోరణాల



నిర్మాణంతో పాటు గద్దెల వద్దకు భక్తులు సులువుగా చేరుకోవడం.. గద్దెల దర్శనం... బంగారం (బెల్లం) సమర్పణ.. జంపన్న వాగులో స్నానాలచరించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయనున్నారు. మేడారం అభివృద్ధి పనుల్లో గిరిజన సంప్రదాయాలు, విశ్వాసాలకు ఎటువంటి భంగం కలగవద్దనే కృతనిశ్చయంతో ఉన్న ప్రజా ప్రభుత్వం ప్రతి నిర్మాణం.. ప్రతి కట్టడాన్ని పూర్తిగా ఆదివాసీ సంప్రదాయాలకు అనుగుణంగా, మేడారం జాతర పూజారులు, ఆదివాసీ పెద్దలసూచనలతో ప్రభుత్వం చేపట్టనుంది. నిర్మాణాల్లో విలువైన గ్రానైట్, లైమ్‌స్టోన్ రాళ్లను వాడనున్నారు. పురాతన ఆలయాల పునఃనిర్మాణం, ప్రసిద్ధ ఆలయాల్లో అభివృద్ధి పనుల్లో ప్రసిద్ధుడైన స్తపతి ఈమని శివనాగిరెడ్డి సేవలను మేడారం అభివృద్ధి పనులకు ప్రభుత్వం వినియోగించుకుంటోంది. గతంలో ముఖ్యమంత్రులు, మంత్రులు జాతరకు వెళ్లడం... దర్శనాలతో సరిపుచ్చేవారు. మేడారం అభివృద్ధిపై ఏమాత్రం శ్రద్ధ వహించలేదు. ఈసారి అందుకు భిన్నంగా ప్రపంచ పటంలో జాతరకు మరింత వన్నె తేవాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సంకల్పించారు. ఆదివాసీల సంప్రదాయాలు, ఆకాంక్షలకు అద్దంపట్టేలా మేడారం జాతరను అభివృద్ధి చేసేలా ప్రణాళికలు తయారు చేయాలని ఇటీవలే సీఎం అధికారులను ఆదేశించారు. రెండేళ్లకోసారి జరిగే మహా జాతరతో పాటు ఏడాది పొడవునా అన్ని రోజుల్లో మేడారం వచ్చి గద్దెలను దర్శించుకునే భక్తుల సంఖ్య పెరిగింది. వీకెండ్, సెలవు దినాల్లో ఈ రద్దీ మరింత పెరుగుతోంది. పెరుగుతున్న భక్తుల రద్దీకి అనుగుణంగా అవసరమైన వసతి, సదుపాయాల కల్పనపై ప్రభుత్వం దృష్టి సారించింది. మేడారం అభివృద్ధి పనులతో ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలకు పెద్ద పీట వేయటంతో పాటు ఆధ్యాత్మిక పర్యాటకానికి ప్రభుత్వం ఊతమివ్వనుంది. ఫలితంగా మేడారం సమీపంలో ఉన్న రామప్ప, ఇతర ఆలయాలకు భక్తుల సంఖ్య పెరిగి స్థానికులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడనున్నాయి.

### భూసేకరణ స్పీడప్ చేయాలి

**జనగామ, మన చౌరాస్తా :** జాతీయ రహదారుల నిర్మాణానికి అవసరమైన భూ సేకరణ, అటవీ భూముల కేటాయింపు, కోర్టు కేసులు పరిష్కార ప్రక్రియను ఈ నెలాఖరు లోపు పూర్తి చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. సోమవారం సచివాలయం నుంచి రాష్ట్ర ఆర్ అండ్ బి శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, సిఎస్ రామకృష్ణా రావు, ఆర్ అండ్ బి కార్యదర్శి వికాస్ రాజ్‌తో అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా ఇంచార్జి కలెక్టర్ పింకేష్ కుమార్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్ షాలోమ్, జనగామ ఆర్డిఓ గోపి రామ్, ఆర్ అండ్ బి ఈఈ స్వరూప రాణి, మైనింగ్ అధికారి విజయ్ కుమార్, ఎఫ్ ఆర్ వో కొండల్ రెడ్డి, జాతీయ రహదారుల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



### బాల త్రిపుర సుందరిగా
## అమ్మబావి ఉప్పలమ్మ తల్లి..

జనగామ పట్టణంలోని అమ్మ బావి వద్ద శ్రీఉప్పలమ్మ సహిత శ్రీఆంజనేయ స్వామి దేవాలయంలో దేవి శరన్నవరాత్రులు ఘనంగా ప్రారంభమయ్యాయి. వేడుకల్లో భాగంగా సోమవారం మొదటి రోజున అమ్మవారు బాల త్రిపుర సుందరి దేవి గా దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి పూజలు చేశారు.

*- మన చౌరాస్తా, జనగామ*

SRIRAMA TRANSPORT
TRUSTED GOODS CARRIER - ON TIME, EVERY TIME
Kemidi Ramesh
9849146698
OUR SERVICES
All Goods Vehicle
Mini Goods Carrier
24x7 Transport Service
House Shifting, Packers & Movers

# బతుకమ్మ, దసరా ఏర్పాట్లు పక్కగా ఉండాలి

- **వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు**




**వరంగల్, మన చౌరాస్తా :** ప్రజలకు అసౌకర్యం కలగకుండా పండుగలు శాంతియుతంగా, ఆనందంగా జరగేలా అధికారులంతా సమన్వయంతో పనిచేసి, ప్రజలు సంతోషంగా పండుగలను జరుపుకునేలా కృషి చేయాలని ఎమ్మెల్యే నాగరాజు అన్నారు. వరంగల్ జిల్లా కలెక్టర్ సమావేశ మందిరం నందు అదనపు కలెక్టర్ శ్రీమతి సంధ్యారాణి అధ్యక్షతన వర్ధన్నపేట, పర్వతగిరి మండలాల పరిధిలోని గ్రామాల్లో సద్దుల బతుకమ్మ మరియు దసరా పండుగ ఏర్పాట్ల గురించి సమీక్ష సమావేశం నిర్వహించారు. అదే విధంగా హసన్ పర్తి ఎంపీడీవో కార్యాలయ సమీపంలోని ట్రైనింగ్ సెంటర్ నందు హసన్పర్తి, ఐనవోలు మండలాల పరిధిలోని పంచాయతీ కార్యదర్శులతో సద్దుల బతుకమ్మ, దసరా పండుగ ఏర్పాట్ల గురించి సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ..."సద్దుల బతుకమ్మ, దసరా పండుగలు తెలంగాణ సాంస్కృతిక ఆత్మను ప్రతిబింబించే గొప్ప వేడుకలు. ప్రజలు భారీగా పాల్గొనే ఈ పండుగలకు సంబంధించి భద్రత, పరిశుభ్రత, తాగునీరు, విద్యుత్, ట్రాఫిక్, పార్కింగ్, ఆరోగ్య సదుపాయాలు వంటి అన్ని ఏర్పాట్లు సక్రమంగా చేయాలని సంబంధిత అధికారులను ఆదేశిస్తున్నాను. ప్రజలకు అసౌకర్యం కలగకుండా పండుగలు శాంతియుతంగా, ఆనందంగా జరగేలా చూడాలి. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, చిన్నారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకోవాలి" అని తెలిపారు. ఈ సందర్భంగా అధికారాలకు పలు సూచనలు సలహాలు చేశారు. అధికారులంతా సమన్వయంతో పనిచేసి, ప్రజలు సంతోషంగా పండుగలను జరుపుకునేలా కృషి చేయాలని ఎమ్మెల్యే నాగరాజు స్పష్టం చేశారు. అలాగే గ్రామాల్లో ఉన్న చిన్న చిన్న సమస్యలు ఏమైనా ఉంటే వాటిని నా దృష్టికి తీసుకురావాలనీ అన్నారు. ప్రతి 2 నుంచి 3 నెలల ఒకసారి సమీక్ష సమావేశం నిర్వహించుకొని గ్రామాల సమస్యల పరిష్కారానికి కృషి చేసుకుందామన్నారు. ఈ సమావేశంలో జెడ్పీసీఈవో రామ్ రెడ్డి, డిపీఓ కల్పన, మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య, ఎంపీడీవోలు శంకర్ నాయక్, వెంకటరమణ, కరుణాకర్ రెడ్డి, ఎంవో రఘుపతి రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# క్రైమ్స్ అదనపు డీసీపీగా బాలస్వామి బాధ్యతలు

**హనుమకొండ, మన చౌరాస్తా :** వరంగల్ పోలీస్ కమిషనరేట్ క్రైమ్స్, ఆపరేషన్ విభాగం నూతన అదనపు డీసీపీగా జి.బాలస్వామి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ను మర్యాద పూర్వకంగా కలుసుకొని పుష్పగుచ్ఛాలను అందజేశారు. అదనపు డీసీపీ బాలస్వామి గతం వరంగల్ పోలీస్ కమిషరేట్ లో ట్రాఫిక్ ఏసీపీగా సమర్ధవంతంగా పనిచేశారు.






# హన్మకొండ కలెక్టరేట్‌లో ప్రజావాణి

**హనుమకొండ, మన చౌరాస్తా :** హనుమకొండ జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ప్రజావాణి కార్యక్రమంలో హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి వై.వి. గణేష్ పాల్గొని ప్రజల నుండి విజ్ఞప్తులను స్వీకరించారు. సమస్యల పరిష్కారం కోసం సంబంధిత శాఖల అధికారులు చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు తమ తమ సమస్యలను పరిష్కరించాలని విన్నవిస్తూ 157 వినతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఓ మేన శ్రీను, సిపిఓ సత్యనారాయణరెడ్డి, హనుమకొండ, పరకాల ఆర్డీవోలు రాథోడ్ రమేష్, డాక్టర్ నారాయణ, ఇతర జిల్లా అధికారులు, పలువురు తహసీల్దార్లు తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# జనగామ సీఐని కలిసిన కాంగ్రెస్ లీడర్లు




**జనగామ, మన చౌరాస్తా :** జనగామ నూతన సీఐగా వచ్చిన సత్యనారాయణరెడ్డిని కాంగ్రెస్ నాయకులు సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జనగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్, మండల కాంగ్రెస్ పార్టీ లింగాల నర్సిరెడ్డి, జిల్లా నాయకులు అలేటి సిద్దిరాములు, దిశ సభ్యులు బక్క శ్రీనివాస్, ఏఎంసీ డైరెక్టర్ నామాల శ్రీనివాస్, మాజీ ఎంపీపీ గోవర్ధన్ రెడ్డి, మండల కాంగ్రెస్ నాయకులు బడికే కృష్ణ స్వామి, గుండా శ్రీధర్ రెడ్డి, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ప్రకాశ్ యాదవ్, సేవాదళ్ నాయకులు దాసరి శేఖర్, పట్టణ కిషన్ కాంగ్రెస్ అధ్యక్షులు మోటె శ్రీనివాస్, వివిధ గ్రామాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లేశం, జనార్దన్, నాయకులు నోముల రాజు, వల్లాల మల్లేశం, సత్యనారాయణ, యూత్ కాంగ్రెస్ నాయకులు పిడుగు రమేష్, రఘు గౌడ్, రాజు, అరవింద్ గౌడ్, మనన్ పాల్గొన్నారు.



# మృతుని కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే పల్లా

**కొమురవెల్లి మన చౌరాస్తా :** కొమురవెల్లి మండలంలోని గౌరాయపల్లి గ్రామానికి చెందిన పెద్ది మధుసూదన్ రెడ్డి మృతి చెందగా మృతుని కుటుంబాన్ని సోమవారం జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా గౌరయపల్లిలోని వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా బొంగు రాజేందర్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే వెంట ఉన్నారు.




# ఘనంగా ప్రారంభమైన దేవి నవత్రోత్సవాలు

**బచ్చనపేట, మన చౌరాస్తా :** శ్రీ హిందూ వాహిని యూత్ అసోసియేషన్ బచ్చన్నపేట ఆధ్వర్యంలో ప్రతి ఏటా నిర్వహించే దేవి శరన్నవరోత్రోత్సవాలు ఈ సంవత్సరం కూడా ఘనంగా ప్రారంభమయ్యాయి. మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆవరణలో నిర్వహించే ఈ నవరాత్రుల్లో భాగంగా మొదటి రోజు అమ్మవారు బాల త్రిపుర సుందరిగా దర్శనమిచ్చారు. అనంతరం యూత్ కమిటీ సభ్యులతో పాటు పట్టణ ప్రజలు మొదటి రోజు పూజ కార్యక్రమంలో పాల్గొని అమ్మవారికి మొక్కలు చెల్లించుకున్నారు. రాష్ట్ర ప్రజలు, రైతులు సుఖ సంతోషాలు, పాడిపంటలతో అష్టైశ్వర్యాలతో ఉండాలని అమ్మవారిని కోరుకున్నారు.

## నవదుర్గ యూత్ ఆధ్వర్యంలో..

నవదుర్గ యూత్ ఆధ్వర్యంలో దుర్గ మాత నవరాత్రి ఉత్సవాలు ఘనంగా సోమవారం ప్రారంభం అయ్యాయి. మండలంలోని వి ఎస్ ఆర్ నగర్ గ్రామానికి చెందిన నవదుర్గ యూత్ ఆధ్వర్యంలో గత మూడు సంవత్సరాలుగా దుర్గామాత నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. సోమవారం నవదుర్గ యూత్ సభ్యులు దుర్గ మాత ఉత్సవాలను ఘనంగా ప్రారంభించారు. అమ్మవారు కొలువుదీరిన మొదటి రోజు బాలా త్రిపుర సుందరి నవదుర్గ యూత్ సభ్యులు భక్తిశ్రద్ధలతో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నవరాత్రి ఉత్సవాలు నిర్వహించడం ద్వారా, యువతకు సాంస్కృతిక, ఆధ్యాత్మిక విలువలను తెలుస్తాయి. కార్యక్రమంలో నవదుర్గ యుత్ సభ్యులు పాల్గొన్నారు.






# తెలంగాణ దేశానికే ఆదర్శం

- అవినీతికి ఆస్కారం లేకుండా పారదర్శకంగా పాలన
- చిల్లర పనులు, చిలిపి చేష్టలతో నియోజకవర్గానికి చెడ్డ పేరు తెచ్చారు
- స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

**లింగాలఘణపురం, మన చౌరాస్తా :** సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ రాష్ట్ర దేశానికే ఆర్శంగా నిలుస్తుందని మాజీ డిప్యూటీ సీఎం, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. సోమవారం లింగాలఘణపురం మండలం నెల్లూట్లలోని కె.బి.ఆర్ ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా లింగాలఘణపురం మండలానికి సంబంధించిన



67మంది కల్యాణ లక్ష్మి లబ్ధిదారులకు రూ.67.07 లక్షల చెక్కులను, 32 మంది ముఖ్యమంత్రి సహాయ నిధి లబ్ధిదారులకు రూ.11.01లక్షల చెక్కులను పంపిణి చేశారు. అనంతరం ఎమ్మెల్యే కడియం మాట్లాడుతూ కొందరు గడిచిన 15ఏళ్లలో నియోజకవర్గ అభివృద్ధిని గాలికి వదిలేసి చిల్లర పనులు, చిలిపి చేష్టలతో, అవినీతి, అక్రమాలతో స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గానికి చెడ్డ పేరు తెచ్చారని ఆరోపించారు. పనులు, పదవులు, పథకాలు అమ్ముకొన్న వారు ఈరోజు సిగ్గులేకుండా మాట్లాడుతున్నారని విమర్శించారు. నేను ప్రజల ముందు పెట్టిన అభివృద్ధి పనుల వివరాలలో ఏ పని మంజూరు కాలేదో నిరూపించాలని సవాల్ విసిరారు. ఎంత సేపు పనిలేని, పసలేని విమర్శలు చేసే వాళ్లకు ఏం చెప్పినా వెస్ట్ అని అన్నారు. నియోజకవర్గ ప్రజలు అభివృద్ధికి అండగా ఉంటూ సహకారం అందించాలని కోరారు. లింగాలఘణపురం మండలంలో ఈ రోజు ప్రతీ గ్రామానికి గోదావరి జలాలు పారుతున్నాయని తెలిపారు. శ్రీరామ నవమి లోపు జీడికల్ రోడ్డు పనులు చేయడంతో పాటు జీడికల్ చెరువును గోదావరి జలాలతో నింపుతామన్నారు. ఈ కార్యక్రమంలో జనగామ వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ కొల్లూరి నర్సింహులు (శివకుమార్), తహసీల్దార్ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



## భద్రకాళి అమ్మవారి సన్నిధిలో ఎంపీ, ఎమ్మెల్యే

**వరంగల్, మన చౌరాస్తా :** దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా భద్రకాళి అమ్మవారిని, వేయి స్తంభాల ఆలయంలో దుర్గామాతను సోమవారం వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డితో కలిసి వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య మాట్లాడుతూ.. దేవి నవరాత్రి ఉత్సవాలు భక్తులకు ఆధ్యాత్మిక శక్తిని, సమాజానికి శుభసూచక మార్గదర్శకత్వాన్ని అందిస్తాయన్నారు. వరంగల్ చారిత్రక ఆలయాలు, దేవాలయాలు మన సంస్కృతి వైభవానికి ప్రతీకలని తెలిపారు. దేవి కటాక్షంతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని, వరంగల్ మహానగరం అభివృద్ధి పథంలో మరింత ముందుకు సాగాలని అమ్మవారిని కోరుకున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా భక్తుల సౌకర్యం కోసం ఆలయాల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టేందుకు తాను కృషి చేస్తానని ఎంపీ తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్టీ జాబితా నుంచి లంబాడీలను తొలగించవద్దు

**హుస్నాబాద్, మన చౌరాస్తా :** ఎస్టీ జాబితా నుంచి లంబాడీలను తొలగించాలని సుప్రీం కోర్టులో పిటిషన్ వేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు తెల్లం వెంకట్రావు, సోయాం బాబురావు పై చర్యలు తీసుకోవాలని కోరుతూ హుస్నాబాద్ క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర రవాణా శాఖ మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కు గిరిజన నాయకులు వినతి పత్రం సమర్పించారు. లంబాడీల పై కుట్రలు చేసి సుప్రీంకోర్టులో పిటిషన్ వేసిన తెల్లం వెంకట్రావు, సోయం బాబురావు పై పార్టీ పరంగా క్రమశిక్షణ చర్యలు తీసుకొని వారిని పదవుల నుండి తొలగించాలని కోరారు. లంబాడీలపై సానుకూలంగా సుప్రీంకోర్టులో ముఖ్యమంత్రి, మంత్రులు స్పందించాలంటూ విజ్ఞప్తి చేశారు. హుస్నాబాద్ లో అతి పెద్ద గిరిజన తండాలు ఉంటాయని, తమ జాతి పై మరోసారి కూడా కుట్రలు చేయకుండా కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం పకడ్బందీగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ గిరిజన నాయకులతో మాట్లాడుతూ దేశంలోనే మొట్టమొదటిసారిగా ఇందిరా గాంధీ లంబాడిలను గుర్తించి ఎస్టీ జాబితాలో చేర్చిందన్నారు. ఎవరు ఎన్ని కుట్రలు చేసినా ఎస్టీ జాబితా నుండి లంబాడీలను తొలగించరని, లంబాడీలు అధైర్య పడకుండా ఉండాలని, కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటదని భరోసా ఇచ్చారు. వినతిపత్రం కార్యక్రమంలో లావుడియా భీక్య నాయక్, భూక్య సరోజన, లకావత్ వెంకటేష్, భూక్య మోహన్, రూప్ సింగ్ తదితరులు ఉన్నారు.






## కేంద్ర్రం ప్రభుత్వ వల్లే అమెరికా, భారత్ దౌత్య వైఫల్యం

- మంత్రి పొన్నం ప్రభాకర్

**హుస్నాబాద్, మన చౌరాస్తా :** కేంద్ర ప్రభుత్వం అమెరికాతో దౌత్య సంబంధాల్లో పూర్తిగా విఫలమైందని మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రంగా విమర్శించారు."తెలంగాణ తరచూ విదేశీ పెట్టుబడులకు ఆహ్వానిస్తుంటుంది. అయితే, ప్రస్తుత పరిస్థితుల్లో అమెరికా విధిస్తున్న నియమ నిబంధనలు మన విద్యార్థులు, ఉపాధి కోసం వెళ్లే వారికి అడ్డంకిగా మారుతున్నాయి. ఇది విదేశాంగ శాఖ వైఫల్యానికి నిదర్శనం" అని ఆయన వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్ విదేశాల్లో ఉన్న భారతీయ మేధావులు, ముఖ్యంగా అమెరికాలో సీఈవోలుగా ఉన్నవారిని ఉద్దేశించి మాట్లాడారు. "మీ ప్రతిభను స్వదేశానికి అంకితం చేయండి. ప్రభుత్వాలు మీ పెట్టుబడులకు ఎర్రకార్పెట్ పరచడానికి సిద్ధంగా ఉన్నాయి. తెలంగాణ గ్రామీణ ప్రాంతాలను పారిశ్రామికంగా, సాంకేతికంగా అభివృద్ధి చేసేందుకు పెట్టుబడులు పెట్టండి" అని విజ్ఞప్తి చేశారు.

## రేపు నేషనల్ డైరీ డెవలప్మెంట్ బోర్డ్ జాతీయ స్థాయి సెమినార్



**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** నేషనల్ డైరీ డెవలప్మెంట్ బోర్డ్ ఏర్పడి 60 సంవత్సరాలు అవుతున్న సందర్భంగా దేశవ్యాప్తంగా గోల్డెన్ జూబ్లీ సంబరాలు నిర్వహిస్తుంది. ఈ క్రమంలో ఈ నెల 24న అనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూరులోని స్వకృషి మహిళ డైరీ ఆవరణలో ఎన్ డి డి బి కోపరేటివ్ ప్రాస్పరేటివ్ అనే అంశంపై రాష్ట్రస్థాయిలో ఒకరోజు సెమినారు నిర్వాహణ జరుగుతున్నట్లు డైరీ అధ్యక్షురాలు బుర్ర ధనశ్రీ ఒక ప్రకటనలో తెలిపారు. నల్గొండ, రంగారెడ్డి, గవర్నమెంట్ ఫెడరేషన్, ముల్కనూర్ డైరీ మొదలగు నాలుగు డైరీల నుండి 100 మంది ప్రతినిధులు ఒక్క రోజు సెమినార్ కార్యక్రమానికి హాజరవుతున్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమానికి నెఫ్కాబ్ జాతీయ చైర్మన్ కోడూరు రవీందర్, తెలంగాణ ఫెడరేషన్ రాష్ట్ర చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి లు హాజరుకానున్నట్లు ఆమె తెలిపారు. అదేవిధంగా ఈ ఏడాదికి గాను ముల్కనూర్ డైరీలో పాలు పోస్తున్న 23,000 మంది మహిళ రైతులకు 15 కోట్ల 70 లక్షల రూపాయల బోనస్ పంపిణీ చేస్తున్నట్లు డైరీ జీఎం భాస్కర్ రెడ్డి తెలిపారు. సభ్యులు పోసే పాలకు లీటర్కు సగటున 6 రూపాయల 22 పైసలు చొప్పున బోనస్ ను వారి ఖాతాల్లో జమ చేయడం జరుగుతుందన్నారు. 2004 నుండి మొదలైన ఈ బోనస్ ప్రక్రియ నేటి వరకు 122 కోట్ల 44 లక్షల రూపాయలు సభ్యుల ఖాతాల్లో జమ అయినట్లు ఆయన తెలిపారు


Varsha Digitals
8555800812
ఈ-పేపర్ డిజైనింగ్ చేయబడును.





# ఓజి ట్రైలర్ వచ్చేసింది..

పవన్ కల్యాణ్ అభిమానులతోపాటు- తెలుగు సినీ ప్రియులు ఆసక్తిగా ఎదురుచూసిన 'ఓజీ' -ట్రైలర్ వచ్చేసింది. ఆదివారం ఉదయమే రిలీజ్ చేస్తామని ఊరించిన చిత్ర బృందం.. తాజాగా విడుదల చేసింది. పవన్ కల్యాణ్ స్టైలిష్ లుక్స్, తమన్ నేపథ్య సంగీతం ట్రైలర్‌లో హైలైట్‌గా ఉన్నాయి. సుజీత్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో పవన్ గ్యాంగ్‌స్టర్ ఓజాస్ గంభీరగా నటించిన సంగతి తెలిసిందే. బాలీవుడ్ నటుడు ఇమ్రాన్ హష్మీ విలన్ పాత్ర పోషించారు. ప్రియాంక మోహన్ హీరోయిన్. ఈ సినిమా ఈ నెల 25న బాక్సాఫీసు ముందుకు రానుంది. హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో పవర్‌స్టార్ పవన్ కల్యాణ్ నటించిన ఓజి ప్రీ రిలీజ్ ఈవెంట్ ఘనంగా జరిగింది. వర్షం కురిసినా అభిమానుల తాకిడి ఏమాత్రం తగ్గలేదు. వేలాది మందితో స్టేడియాం కిక్కిరిసిపోయింది. పవన్ కల్యాణ్ స్టేజీపైకి కత్తిని చేతిలో పట్టుకుని మెగా స్టైల్లో వేదికపైకి ఎంట్రీ- ఇవ్వడం అభిమానులకి మాంచి కిక్ ఇచ్చింది. పవనన్నా ఎలివేషన్ ఓ రేంజ్‌లో ఉందని కామెంట్ చేస్తున్నారు.. ఈ ఎంట్రీకి సంబంధించిన వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. మరోవైపు పవన్ కళ్యాణ్ ఫ్యాన్స్, జనసైనికులు మాత్రం చాలా రోజుల తర్వాత పవన్ కళ్యాణ్‌ని మళ్లీ సినిమాటిక్ లుక్‌లో చూశామని, అదిరిపోయిందంతే అని కామెంట్ చేస్తున్నారు. ఇక ఈ వేడుకలో పవన్ కళ్యాణ్ చేసిన కామెంట్స్ నెట్టింట హల్‌చల్ చేస్తున్నాయి. సుజీత్ నాకు పెద్ద అభిమాని. కథను ముక్కలు ముక్కలుగా చెప్పినా, డైరెక్షన్‌లో మాత్రం అదరగొట్టాడు. థమన్ ఈ సినిమాకు ఇంకో హీరో లాంటివాడు. ఈ సినిమాలో నేను బాగా ఇన్వాల్వ్ అయ్యాను... డిప్యూటీ- సీఎం అన్న విషయమే మర్చిపోయాను, అని మాట్లాడి అభిమానులను ఆకట్టుకున్నారు పవన్ కళ్యాణ్.ఖుషి సినిమా తరువాత నా ఫ్యాన్స్ ఎంతో ఆతృతగా ఒక సినిమా కోసం ఎదురుచూస్తున్నారని తెలిసింది. ఇప్పుడు అదే సినిమా ఓజి అని చెప్పారు. ఇక సుజిత్ టీమ్ చాలా బాగుంది. ఇలాంటి టీమ్ నా మొదట్నుంచి ఉంటే నేను రాజకీయాల్లోకి వచ్చేవాడినే కాదు,' అంటూ పవన్ స్పెషల్‌గా సుజీత్ టీమ్‌ను పొగడ్తలతో ముంచెత్తారు.



# దుల్కర్ నా బెస్ట్ ఫ్రెండ్

## కొత్తలోక హీరోయిన్ కళ్యాణి

మలయాళీ బ్యూటీ అయినప్పటికి కల్యాణి ప్రియదర్శన్ తెలుగు ప్రేక్షకులకు కూడా బాగా పరిచయం. హలో, చిత్రలహరి, రణరంగం సినిమాలతో టాలీవుడ్‌లో మంచి గుర్తింపు సంపాదించుకున్న ఈ భామ, తాజాగా విడుదలైన 'కొత్త లోక'లో సూపర్ ఉమెన్ పాత్రతో అలరించింది. ఇంతవరకు ప్రధానంగా సరదా పాత్రలు చేసిన ఆమె, ఈ సినిమాలో తొలిసారి యాక్షన్ సీన్లలో కనిపించడం ప్రత్యేకం. అయితే ఇటీవల ఇంటర్వ్యూలో కల్యాణి తన కెరీర్‌తో పాటు- వ్యక్తిగత జీవితానికి సంబంధించిన ఆసక్తికర విషయాలు పంచుకుంది. మా స్వస్థలం కేరళ అయినప్పటికీ నేను చెన్నై లో పుట్టి పెరిగాను. అమ్మానాన్న ఇండస్ట్రీల్రో ఉండటంతో చిన్నప్పటి నుంచే షూటింగ్ సెట్స్ వాతావరణం నాకు పరిచయం. అక్కడి నుంచే సినిమాలపై ఆసక్తి పెరిగింది. 2017లో 'హలో' ద్వారా టాలీవుడ్‌లో హీరోయిన్‌గా అడుగు పెట్టాను. అప్పటి వరకు ఎక్కువగా లైట్ హార్ట్‌డ్ రోల్స్ మాత్రమే చేసాను. కానీ 'కొత్త లోక' కోసం నేను ఆరు నెలలు స్పెషల్ ట్రైనింగ్ తీసుకుని యాక్షన్ సీక్వెన్స్ చేశాను. ఇది నాకు కొత్త అనుభవం అని చెప్పింది. అలాగే తన స్నేహితుడు దుల్కర్ సల్మాన్ గురించి మాట్లాడుతూ.. సినీ ఇండస్ట్రీల్రో నాకు దుల్కర్ బెస్ట్ ఫ్రెండ్. నాకు ఏ కష్టం వచ్చినా, ఏ సమస్య ఎదురైనా, లేదా ఏదైనా సలహా కావాలన్నా మొదటి ఫోన్ దుల్కర్‌కే చేస్తాను. ఆయన నాకు చాలా సపోర్ట్‌గా ఉంటారని చెప్పి తన బంధాన్ని బయటపెట్టింది. కల్యాణి ప్రస్తుతం మలయాళం, తెలుగు సినిమాల్లో వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉంటూ, విభిన్న పాత్రల ద్వారా తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకోవాలని ప్రయత్నిస్తోంది.